సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం। 27। జనవరి। 2023



అక్షరాభ్యాస పూజలు

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలోని సరస్వతి దేవి మండపం వద్ద గురువారం చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.



నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలోని ఉపాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు.

మల్లికార్జునస్వామికి పూజలు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచలుని కొండపై వెలసిన దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామికి మాఘ పంచమి సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో వేడుకలు



భీమవరంలో కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న జడ్జి శ్రీసత్యాదేవి

సాక్షి, భీమవరం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరం కోర్టు సముదాయంలో మూడో అదనపు జిల్లా జడ్జి శ్రీసత్యాదేవి జాతీయ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసెంబర్ నెలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.అప్పల స్వామి, డి.సోని, ఏ.పవన్ కుమార్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు



ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ యు.రవి ప్రకాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వెలుగొందుతుందన్నారు.

నిట్‌లో గణతంత్ర దినోత్సవం



నిట్‌లో గౌరవ వందనం స్వీకరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ నిట్‌లో గురువారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యం వహించారు. రిజిస్ట్రార్ దినేష్ శంకర రెడ్డి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం అన్నారు. దేశ పౌరులందరికీ సమన్యాయం కల్పించేలా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత జాతీయ జెండా ఎగురవేసి, సిబ్బంది నుంచి గౌరవ వందనం సీక్వరించారు. డీన్‌లు డాక్టర్ జీవీ వీరేష్ కుమార్, టి.కురుమయ్య, కార్తీక్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో..



జెండా వందనం చేస్తున్న ఉపకులపతి జానకీరామ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిపాలన భవనంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ జెండా ఎగురువేసి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఆర్‌బీకేలను బలోపేతం చేసిందని చెప్పారు. ఉద్యాన కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో తేనెటీగలపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఉపకులపతి ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎ.ఎస్.పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు రథసప్తమి వేడుకలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై తిరువీధి సేవలు జరుపుతామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.



భీమవరంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లా ముందంజకు కృషి
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో జిల్లాను ముందుంచేందుకు నిరంతరం కృషిచేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ప్రశాంతి ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందం స్వీకరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై కలెక్టర్, ఎస్పీ యు.రవిప్రకాష్ పెరేడ్ కవాతులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమం అందిస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నామని ఈ ఏడాది 2.20 లక్షల మంది రైతులకు రూ.110 కోట్లను సాయంగా అందజేసినట్లు చెప్పారు.రూ. 6,183 కోట్లను పంట రుణాలుగా అందిస్తామన్నారు. పంటల బీమాలో 50,314 మంది రైతులకు రూ.100 కోట్ల నష్టపరిహారంగా అందజేసినట్లు వివరించారు. సముద్ర తీర ప్రాంతంలో 43,776 హెక్టార్ల విస్తీర్ణంలో ఆక్వా సాగు ద్వారా ఈ ఏడాది ఇంతవరకు 1.64 లక్షల టన్నుల చేపలు, 1.46 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరిగిందని, దేశంలో ఆక్వా ఉత్పత్తులలో ముందంజలో ఉన్నామన్నారు.

సంక్షేమ పథకాలతో చేయూత

జిల్లాలో పంట, మురుగు కాలువల అభివృద్ధికి 135 పనులకు రూ.16.3 కోట్లు మంజూరుచేసి 44 పనులను పూర్తి చేశామన్నారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో 72,636 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో సుమారు 2.23 లక్షల మందికి ప్రతినెల రూ.61 కోట్లు అందచేస్తున్నామన్నారు. 16,551 స్వయం సహాయక సంఘాలకు రూ.965 కోట్ల రుణాలను మంజూరు చేయగా వైఎస్సార్ ఆసరా పథకంలో 30,566 ఎస్‌హెచ్‌జీలకు రూ.534 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో 30,441 సంఘాలకు రూ.168 కోట్లు పంపిణీ చేశామని కలెక్టర్ వివరించారు. వైఎస్సార్ చేయూత పథకంలో 81,294 మందికి రూ. 153 కోట్లు, జగనన్నతోడు పథకంలో 66,113 మందికి రూ.66 కోట్లు రుణాలు మంజూరు చేయగా, స్త్రీనిధి పథకంలో 20,750 స్వయం సహాయ సంఘాలకు రూ. 81.44 కోట్లు అందజేశామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో 16,273 ట్యాబ్‌లు పంపిణీ చేశామన్నారు. నాడు నేడు పథకంలో పాఠశాలల అభివృద్ధికి రెండు విడతల్లో 1,236 పాఠశాల్లో రూ. 158 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల శీతలీకరణ కేంద్రాల నిర్మాణాలు చేపట్టామని గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తుండగా 3,401 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా 29,238 మందికి ఉపాధి కల్పించినట్లు కలెక్టర్ ప్రశాంతి వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ చైర్మన్ వంక రవీంద్ర, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు, ఇన్‌చార్జ్ డీఆర్వో దాసి రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రవాణా శాఖ శకటం



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవాల్లో విద్యార్థుల విన్యాసాలు



నృత్య ప్రదర్శన



ఐసీడీఎస్ చిన్నారుల నృత్య రూపకం

అలరించిన ప్రదర్శనలు

సాక్షి, భీమవరం: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భీమవరం కలెక్టరేట్ ఆవరణలో గురువారం వివిధ పాఠశాల విద్యార్థులు, ఐసీడీఎస్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ప్రభుత్వ పథకాల శకటాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పోలీసులు, హోంగార్డ్స్, ఎన్‌సీసీ కవాతులు అలరించాయి.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల్లో భీమవరం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, ఎల్వీ చర్ల గురుకుల పాఠశాల ద్వితీయ బహుమతి, విస్సాకోడేరు ఐసీడీఎస్ చిన్నారుల నృత్య ప్రదర్శన తృతీయ బహుమతి గెలుపొందాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాల శకటాల ప్రదర్శనలో మొదటి బహుమతిని వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ శాఖ, ద్వితీయ బహుమతి విద్య, పశు సంవర్ధక శాఖలు, తృతీయ బహుమతి హౌసింగ్, డ్వామా, ఉద్యానవన అండ్ మైక్రో ఇరిగేషన్ శాఖల శకటాలు గెలుపొందాయి. డీఆర్‌డీఏ, బీసీ కార్పొరేషన్, ఎస్సీ సేవా సహకార సంఘం లిమిటెడ్, పరిశ్రమలు, స్త్రీ,శిశు సంక్షేమం తదితర శాఖలు స్టాల్స్‌ని ఏర్పాటు చేశాయి.

బాలరాజును ఫోన్‌లో పరామర్శించిన సీఎం జగన్



సీఎంతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు ఆరోగ్య పరిస్థితిని, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని ఎంతటి కష్టం వచ్చినా తాను అండగా ఉండి ఆదుకుంటానని సీఎం భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. తాను కోలుకోవాలని దేవాలయాల్లో, మసీదు, చర్చిల్లో ప్రార్థనలు, పూజలు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. రాజమండ్రి సాయి హాస్పటల్‌లో చికిత్సపొందుతున్న ఆయన గురువారం సాయంత్రం డిశ్చార్జ్ అయ్యారు.

ఎందరో మహనీయుల త్యాగఫలం

ఏలూరు టౌన్: బ్రిటీష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారని ఏలూరు రేంజ్ ఐజీ జీ.పాలరాజు అన్నారు. ఏలూరులోని ఐజీ క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని స్మరించుకుంటూ దేశ సమైక్యతకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయనే స్వయంగా మిఠాయిలు పంచిపెట్టారు.



క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన ఐజీ పాలరాజు

సేవలకు పురస్కారం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, సిబ్బంది, సంఘ సేవకులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి గురువారం భీమవరంలో కలెక్టర్ పి.ప్రశాంతి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.

– సాక్షి, భీమవరం



కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న భీమవరం ఆర్డీవో దాసి రాజు



టి.శివరామ్‌ప్రసాద్ (సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్), ఎ.దుర్గేష్ (ఉద్యాన శాఖాధికారి), ఆర్‌వీ రమణ (జిల్లా విద్యాశాఖాధికారి), ఎన్.సరోజ (జిల్లా పౌరసరఫరాల అధికారిణి), దాసరి నాగార్జున (సమాచారశాఖ ఏడీ), జెడ్.వెంకటేశ్వరరావు (జేడీఏ), జి.జాషువరాజు (ఏఎస్ఐ, పాలకొల్లు టౌన్), కేవీ సత్యనారాయణ (ప్రిన్సిపాల్, జీవీఆర్ ప్రభుత్వ కళాశాల, భీమవరం)



చెరుకువాడ రంగసాయి (సంఘ సేవకుడు), ఎ.రామరాజు (గృహనిర్మాణశాఖ పీడీ), పీఆర్ బాబు (నరసాపురం ఆర్టీసీ డీఎంఈ), నాగలత (డీపీఓ), పీర్ అహ్మద్‌ఖాన్ (ఎలక్ట్రికల్ ఈఈ), పీఎస్‌వీఎస్ఎన్ మూర్తి (తణుకు ఆర్టీసీ డీఎం), ఎం.సూర్యహంసిని (జాతీయ స్థాయి ఆర్చరీ విజేత), బి.బాలస్వామి (మునిసిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం)

కొండ్రుప్రోలులో చోరీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలులో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సై పీఎస్.వీరభద్రరావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో కొట్టు దుర్గనాగశ్రీనివాస్ నివాసం ఉంటున్నాడు. ఈ నెల 25వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లాడు. తిరిగి రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చేసరికి గేటు, ఇంటి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లో ఇనుప బీరువాలో ఉన్న రూ.36 వేల విలువైన బంగారపు నానుతాడు, రూ.40 వేల విలువైన వెండి, నగదు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో రూరల్ పోలీసులకు గురువారం బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై తెలిపారు.

జగన్ పాలనలోనే ఎస్సీ, ఎస్టీలకు న్యాయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కృష్ణాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కార్యక్రమం వంద రోజులు పూర్తి





కృష్ణాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వంద రోజులు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో వందవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీల అభివృద్ధికి రూ.33,635 కోట్లు ఖర్చు చేస్తే, వైఎస్ జగన్ మూడున్నరేళ్ల పాలనలో రూ.48,909 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎస్టీల అభివృద్ధికి చంద్రబాబు రూ.12,487 కోట్లు వెచ్చిస్తే, వైఎస్ జగన్ పాలనలో రూ.15,589 కోట్లు ఖర్చు చేశారన్నారు. దీన్ని బట్టి చూస్తే సీఎం జగన్ పాలనలోనే వారి అభివృద్ధికి అధిక నిధులు వెచ్చించినట్లు తేటతెల్లమవుతుందన్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఎస్సీ, ఎస్టీలతో పవన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఆయా సామాజికవర్గాలకు చంద్రబాబు హయాంలో అన్యాయం జరుగుతుంటే ఏనాడు పవన్ ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. అయితే, జగన్ ప్రభుత్వంపై ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని జగన్ అప్పులపాలు చేస్తున్నారని విషప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఐదేళ్ళ పాలనలో పెద్దవాటాదారుడు ఎవరంటే రామోజీరావు అని వ్యాఖ్యానించారు. రూ.11వేల కోట్ల విలువైన పోలవరం ప్రాజెక్టును నామినేషన్ పద్ధతిలో రామోజీరావు అల్లుడికి కేటాయించిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. అటువంటి వ్యక్తులు నేడు పచ్చమీడియా వేదికగా ప్రభుత్వంపై అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. దేశంలో అతి తక్కువ అప్పు కలిగిన రాష్ట్రంగా నాల్గవ స్థానంలోనూ, అప్పులు సక్రమంగా చెల్లిస్తున్న రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉందని, దీనిని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో ఏ రకమైన బడ్జెట్ ఉందో అదే విధమైన బడ్జెట్ నేడు జగన్ పాలనలో ఉందన్నారు. అయితే, నాడు చంద్రబాబు ఇంతటి సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. రాష్ట్రంలో నేడు సమర్థవంతమైన పాలన సాగుతుందన్నారు. గతంలో వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ ప్రజలకు న్యాయం చేసేందుకు పాదయాత్రలు చేశారని, నేడు లోకేష్ పాదయాత్ర దేనికోసమని ప్రశ్నించారు. వార్డు మెంబరుగా కూడా గెలవలేని వ్యక్తి దొడ్డిదారిన ఎమ్మెల్సీగా, మంత్రిగా లోకేష్ పనిచేశాడన్నారు. మరలా ప్రజాక్షేత్రంలో పోటీ చేస్తే తుక్కుతుక్కుగా ఓడించారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ ద్వయంలో పవన్‌ను సీఎం చేస్తానంటేనే గాని ఓట్లు పడే పరిస్థితి లేదని, దీనికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తొలుత గ్రామంలో రూ.60లక్షలు వ్యయంతో నిర్మించనున్న గ్రామ దేవత అలుసులమ్మ ఆలయానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, పిచ్చుకల రాజారావు, ఎలిపే గాంధీ, ఎంపీటీసీ సభ్యులు మట్టా సత్యనారాయణ, మార్లపూడి సుబ్బారావు, జంపెల్ల సత్యవతి, నార్ని శంకరరావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, జిల్లా నీటి సంఘం మాజీ డైరెక్టర్ ఈదర వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, ఉప సర్పంచ్‌లు మేణ్ణి రామారావు, చిట్టూరి కాశీవిశ్వనాథం, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

పెద శేషవాహనంపై దర్శనమిచ్చిన శోభనాచలుడు



ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు పెద్ద శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణ మండపంలో శాంతి కల్యాణాన్ని మంచిర్యాలకు చెందిన శ్రీకాళహస్తి రాజరాజేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 7 గంటలకు గ్రామ కాపు సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి పెద్ద శేష వాహనంపై గ్రామోత్సవం జరిపించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఎస్.భవాని పర్యవేక్షించారు.

ఇంటింటికీ సంక్షేమం



పోడూరు : పోడూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పులిగుమ్మ కాలువకు గండి



గండిని పూడుస్తున్న రైతులు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం పరిధిలోని ఉండి పంట కాలువ నుంచి వెళ్లే పులిగుమ్మ కాలువకు గురువారం అగ్రహారం పరిధిలో గండి పడింది. దీంతో స్థానిక రైతులు స్పందించి కాలువకు ఇరువైపులా మట్టి బస్తాలు, వెదురు తడికలతో గండిని పూడ్చి వరి పంటకు నష్టం లేకుండా చర్యలు తీసుకున్నారు. అయితే కాలువ గట్టు బలహీనంగా ఉండటంతో పలుమార్లు ఇలాగే గండి పడుతోందని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండి పడుతున్న ప్రాంతంలో రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం చేసి వరి పొలాలను ముంపుబారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ డీఈ పీఎస్‌వీవీఎస్ మూర్తిని వివరణ కోరగా గండి ప్రాంతాన్ని ఏఈ పరిశీలిస్తారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలవరం స్పిల్‌వేపై జాతీయ జెండా ఆవిష్కరణ

పోలవరం రూరల్: అన్ని అవాంతరాలను అధిగమించి పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అవుతుందన్న ఆశాభావాన్ని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో శివానందకుమార్ వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేపై జాతీయ జెండాను ఆయన గురువారం ఆవిష్కరించారు. అనంతరం ప్రాజెక్టు సిబ్బంది, నీటిపారుదల శాఖ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశంలో లభ్యమవుతున్న జలవనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి అయ్యేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, చీఫ్ ఇంజినీర్ రాజేష్‌కుమార్, జలవనరుల శాఖ ఎస్ఈ నరసింహమూర్తి, మెగా ఇంజినీరింగ్ సంస్థ సీజీఎం ఎం.ముద్దుకృష్ణ, జీఎం గంగాధర్, ఏజీఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలు ప్రజలందరికీ అందాలి



భీమవరం యూనియన్ బ్యాంక్ వద్ద గణతంత్ర వేడుకల దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం యూనియన్ బ్యాంక్ వద్ద గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ సీతారామరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌరులు తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. తమ రంగాలలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బ్యాంక్ సేవలు అన్ని రంగాల ప్రజలకూ అందాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు రామమోహనరావు, మురళీ, అచ్యుత్, శ్రీధర్, నిర్మలా జ్యోతి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజా రవాణా శాఖ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల ప్రారంభ సభను ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో శుక్రవారం నిర్వహించనున్నామన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా 28న సిబ్బందికి శిక్షణ, 29న నిర్వహణ దినోత్సవం, 30న సిబ్బంది కుటుంబ సభ్యులకు అవగాహన సదస్సు, 31న రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 2వ తేదీన వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఉంటాయన్నారు.

అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో అగ్నిప్రమాదం



ప్రమాదంలో కాలి బూడిదైన బాల్కనీలో సామగ్రి

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని ఓ అపార్టుమెంట్ ఫ్లాట్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో హెడ్‌పోస్టాఫీసు వద్ద ఆర్ఆర్ రెసిడెన్సీలో ఈ ప్రమాదం జరిగింది. భూపతిరాజు సుబ్బరాజుకు చెందిన 206వ నంబర్ ప్లాటులో బాలుడు బాల్కనీలో ఆడుకుంటూ అగ్గిపెట్టె వెలిగించాడు. ఈ సమయంలో బాల్కనీలో దుస్తులకు మంటలు వ్యాపించాయి. కొద్దిసేపటికే బాల్కనీలోని కూలర్, వాషింగ్‌మెషీన్, సైకిల్ వంటి వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న అపార్టుమెంటు వాసులు స్పందించి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తీరంలో అభివృద్ధి పరుగులు

- సీఎం ప్రారంభించిన పనులు ఒకోక్కటిగా కార్యరూపంలోకి..
- తాజాగా వాటర్ పైప్‌లైన్, సబ్‌స్టేషన్ నిర్మాణాలు మరూ
- రెండు నెలల్లోనే పనులు ప్రారంభించడంపై హర్షాతిరేకాలు





నరసాపురంలో మంచినీటి చెరువు, రుస్తుంబాదలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు (ఫైల్)

నరసాపురం: నరసాపురంలో గత ఏడాది నవంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.3,300 కోట్ల విలువైన పలు భారీ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కొద్ది నెలల్లోనే ఒక్కోటిగా కార్యరూపం దాలుస్తూ పనులు ప్రారంభిస్తుండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో రూ.600 కోట్ల ఫిషరీస్ యూనివర్సిటీ పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మున్సిపాలిటీలో రూ.61.81 కోట్ల వ్యయంతో చేపట్టనున్న స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్, అలాగే రూ.133 కోట్ల వ్యయంతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో నిరించనున్న 220/132/11 కేవీ భారీ సామర్థ్యం గల విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన ఈ రెండు నెలల వ్యవధిలోనే ఈ రెండు ప్రాజెక్టుల పనులను ప్రారంభం కావడం విశేషం. 1956లో మున్సిపాలిటీ ఏర్పడగా, 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌లను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మంచినీటి సరఫరా మెరుగుదలకు స్పెషల్ ప్రాజెక్ట్ మంజూరు సాధ్యమైంది. ప్రాజెక్టులో భాగంగా ముందుగా ఓహెచ్ఆర్‌లు నిర్మిస్తున్నారు. పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్టులో భాగంగా మరో నాలుగు ఓహెచ్ఆర్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. రెండు ఓహెచ్ఆర్‌ల పనులు ఇప్పటికే ప్రారంభించారు. ప్రస్తుతం 96 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు ఉండగా, వీటిలో 40 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు పూర్వం ఎప్పుడో వేసినవి. వీటిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించనున్నారు. దీనికి తోడుగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్ల మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌ను అదనంగా నిర్మించనున్నారు. అలాగే నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరిస్తారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులూ ప్రారంభం

విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో రుస్తుంబాదలో నిర్మించ తలపెట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు కూడా ప్రారంభమయ్యాయి. గురువారమే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను కూడా ముదునూరి లాంఛనంగా ప్రారంభించారు. నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ 50 ఎంవీఏ సామర్థ్యం కలిగి ఉండగా, ఇటీవలే దీని సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచారు. ఇప్పుడు అదనంగా దీనికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉండగా, సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపుతో ఈ సమస్యకు తెరపడనుంది.

సకాలంలో అన్ని ప్రాజెక్ట్‌లు పూర్తవుతాయి



రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురంలో పలు భారీ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేశారు. సీఎం శంకుస్థాపనలు చేసిన ఈ ప్రాజెక్ట్‌లు అన్నీ సకాలంలో పూర్తవుతాయి. టెండర్ల ప్రక్రియను పక్కాగా పూర్తి చేసి, గడువు నిర్దేశిస్తూ కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నాం. దీంతో పనులు ఆలస్యం అయ్యే అవకాశం లేదు. పనుల పూర్తిపై అనుమానాలు అక్కరలేదు. ఫిషింగ్ యూనివర్సిటీ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ప్రారంభించిన వాటర్ పైప్‌లైన్స్, విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగంగా పూర్తవుతాయి.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్కే కమ్యూనికేషన్ క్యాలెండర్‌ను ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ వెంకట రాంబాబు, రవికిరణ్, మారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలి



మాంటిస్సోరిలో విద్యార్థులతో వసంత పంచమి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలని ఎంవీఆర్ మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ఎం.ఎల్.ఎస్.ఎన్. రెడ్డి అన్నారు. స్కూల్ ప్రాంగణంలో గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం వసంత పంచమి సందర్భంగా పాఠశాలలో సరస్వతి దేవి పూజ, నూతన అక్షరాభ్యాస వేడుకలు విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడు సార్లు ఉత్తమ మునిసిపల్ కమిషనర్‌గా బాలస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పురపాలక సంఘం ఉత్తమ మునిసిపల్ కమిషనర్‌గా బాలస్వామి 7 సార్లు ప్రతిభా పురష్కారాలు అందుకున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ మురళీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అప్పటి కలెక్టర్ కాటమనేని భాస్కర్ చేతుల మీదుగా ఒకసారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా మూడుసార్లు, డాక్టర్ కార్తికేయ మిశ్రా చేతుల మీదుగా ఒకసారి, ప్రస్తుత కలెక్టర్ ప్రశాంతి చేతలు మీదుగా రెండుసార్లు అందుకున్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హయాంలో పనిచేసిన బాలస్వామి అందరి మన్ననలు పొందుతున్నారు. పలువురు కమిషనర్ బాలస్వామికి అభినందనలు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: స్థానిక శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన సూర్యాలయం, సుబ్రహ్మణ్యేశ్వరాలయం, నవగ్రహ మండపం, చండీశ్వరాలయం, ముఖద్వారాలపై దేవతామూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. సూర్యభగవానుడు దేవాలయంలో బండి భాస్కరరావు, శేషమ్మ దంపతులు, నవగ్రహాలను అన్నెం శేషారావు కుమారులు, బాలసుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని కూనపరెడ్డి వంశీకృష్ణ, ఉషశ్రీ దంపతులు, చండీశ్వరస్వామివారిని బండి అంజన్న, బాలత్రిపురసుందరి దంపతులు, దక్షిణామూర్తి విగ్రహాన్ని దామిశెట్టి రామజగ్గయ్య, నాగసూర్యవాణి దంపతులు ప్రతిష్ఠించారు. ఇంటి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులచే ముఖద్వారానికి కలశ స్థాపన చేసారు. మూషిక వాహనాన్ని సతీష్, శ్రీవాణి దంపతులు ప్రతిష్ఠించారు. ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కోలాట భజన చేసారు. ఈ సందర్భంగా అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

యోగాతో మంచి ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా, వ్యాయామాలతో మంచిఆరోగ్యం సాధ్యమని మునిసిపల్ కమిషనర్ బాలస్వామి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పతంజలి యోగాచార్యులు ఇంజమూరి మాధవరావు, సభ్యులచే పురపాలక సంఘం కార్యాలయం వద్ద యోగా ప్రదర్శన గావించారు. వివిధ ఆసనాలు, వాటి ఉపయోగాలు, వివిధ వ్యాధులు నివారణ, తదితర అంశాల గురించి పురపాలక సిబ్బంది, ఉద్యోగులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లుకు తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువులు మాధవరావు, పవన్ కుమార్, బడుగు సుధాకర్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.సుభద్ర గుప్తా, రామలక్ష్మి, దత్తాత్రేయశర్మ, కుంట్ల మోహన్‌రావు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలను మనమంతా కాపాడుకోవాలని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను ప్రతీ ఒక్కరూ పరిరక్షించుకోవాలన్నారు. డీటీలు పి.అనూరాధ, ఆర్.అన్నపూర్ణ, మండల సర్వేయర్ ఎస్.చక్రవర్తి, ఏఎస్‌వో పి.భార్గవి, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే, ఎంపీడీవో కార్యాలయం, పడాల వద్ద ఎంపీడీవో ఎం.వెంకటేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంఈవో వి.హనుమ, మండల పరిషత్ సిబ్బంది కె.సత్య భరత్‌కుమార్, కె.యోహాను, జె.రత్నకుమార్, పొట్నూరి రాజు, వీరవల్లి దుర్గాప్రసాద్, సీఆర్‌పీ బి.నానిబాబు, జె.థామస్ పాల్గొన్నారు. మండలంలోని మెట్ట ఉప్పరగూడెం సచివాలయం వద్ద వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, నీలాద్రిపురంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, వెంకట్రామపాలెంలో సర్పంచ్ ఎలిపే గాంధీ, ఎల్.అగ్రహారంలో సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న, కడియద్దలో యాతం కోటీశ్వరి, ఎమ్పీటీసీ దారపురెడ్డి దుర్గాదేవి, కడియద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డీవీవీఎస్ఎన్.మూర్తి, ఆరుగొలను సచివాలయం వద్ద సర్పంచ్ పీతల బుచ్చిబాబు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కోర్టు ఆవరణ సముదాయంలో గురువారం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్జిలు నాగ మల్లేశ్వరీ, సి.రమ్య, అరుంధతి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెదగాడి భూపాల్, ఏపీపీ శిరిగినీడి విజయకృష్ణ, సీనియర్ న్యాయవాది మాకా శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ

స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద మునిసిపల్ కమిషనర్ బాలస్వామి జెండా ఆవిష్కరణ చేశారు. మునిసిపల్ ఇంజనీర్ మురళీ కృష్ణ, సర్వేయర్ రౌతు రామకృష్ణ, మునిసిపల్ మేనేజర్ దివ్యకుమారి, టౌన్ ప్లానింగ్, శ్యానటరీ, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో...

స్థానిక భవిత సెంటర్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశనాయకులు చిత్రపటాలకు పూలమాలలు వేశారు. దివ్యాంగుల పిల్లలచే మహనీయుల వేషధారణలు అలరించాయి.

వాకర్స్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కేవీ చలం ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమార్‌స్వామి, కోశాధికారి పి.వెంకట పరమాత్మ, బాకా వెంకటేశ్వరరావు, నూకరాజు, యోహాను, సారధి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో...

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి, కనకదుర్గ, ప్రభావతి, మేరీ వజ్రమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవనంలో..

స్థానిక స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద రిపబ్లిక్ డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బి.హరికుమార్, సంఘ నాయకులు వైఎస్ ఎస్‌మూర్తి, ముస్తాఫా, కృష్ణకుమారి, పార్వతి, విశ్వం రాజు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న తహసీల్దార్ వైకేవీ.అప్పారావు

బీవీఆర్ కళాకేంద్రంలో..

బీవీఆర్ కళాకేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కళాకారులు పీటీ వెంకన్న, కొడవటిగంటి నరసింహాచార్యులు, మాసా బాబురావు, సరస్వతుల హనుమంతరావు, కోపల్లె శ్రీనివాస్, బోణం వెంకట లక్ష్మి, కె.శారద తదితరులు పాల్గొన్నారు. ఏపీ ఎస్ఆర్టీసీ డిపోలో గణతంత్ర దినోత్సవంలో డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయన మూర్తి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.

భారతీయ విద్యా భవన్స్‌లో..

భారతీయ విద్యాభవన్స్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భవన్స్ కోశాధికారి గ్రంధి వరప్రసాద్, కమిటీ సభ్యులు పెన్మెత్స శివరామరాజు, మాజీ సుబేదర్ ప్రత్తి రామకృష్ణ, హవల్దార్ ప్రభాకర్‌లు హాజరైయారు. భవన్స్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ రాజీవ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పలువురుకి సేవాపతకాలు

పెంటపాడులో : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పెంటపాడు మండలానికి చెందిన పలువురు అధికారులకు ఉత్తమ సేవాపతకాలు దక్కాయి. జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా వారు సేవాపతకాలు, ప్రశంసాపత్రాలు అందుకొన్నారు. పెంటపాడు ఎంపీడీవో దామోదరరావు, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, మండల పశువైద్యాధికారి డా.మహేష్, బైరాగిమఠం ఈవో చీమలకొండ సాయి తదితరులు ఉత్తమపతకాలు పొందిన సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.పెంటపాడు మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో డి. దామోదరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జీవీ శేషగిరిరావుల ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో పార్థసారథి తదితరులు జెండావందనం చేసారు. మండలంలోని ఆయా పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్‌లు జాతీయజెండా ఎగురవేసారు. జట్లపాలెం గ్రామంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, మండల వ్యవసాయశాఖ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ తదతరులు జాతీయజెండా ఎగురవేసారు. మీనవిల్లూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం, హైస్కూలు వద్ద సర్పంచ్ లక్ష్మితో పాటు, పార్టీ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్ తదితరులు జాతీయ జెండా ఎగురవేసారు.

జెబీయు ఆధ్వర్యంలో

జీసస్ బిలీవర్స్ యూనియస్(జెబీయు) ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు గూడెంలోని కొండాయిచెర్వు ప్రాంతంలోని టీచర్స్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. జెబీయు అధ్యక్షుడు డల్లా, ఉపాధ్యాయులు మానుకొండ భాస్కరరావు, లూథరన్ చర్చి సంఘ పాలకవర్గ చైర్మన్ నక్కా విద్యాసాగర్, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు చిన్నం డేనియల్ రాజు, జెబీయూ, లూథరన్, అంబేద్కర్ సేవాసంఘ సంఘ సభ్యులు చర్చి విశ్వాసులు, చిన్నారులు పాల్గొన్నారు. రాజ్యాంగ హక్కులు కాపాడతామని పలువురు ఈ సందర్భంగా ప్రతిజ్ఞలు చేశారు.



తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న ఎంపీడీవో ఎం.వెంకటేష్



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు



మునిసిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాలస్వామి

తణుకు టౌన్‌లో: భారత 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను తణుకు మండలంలోని వివిధ కార్యాలయాలు, కళాశాలలుతో పాటు గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తణుకు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలలో తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ రుద్ర ధనరాజు, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో ఆర్ డబ్ల్యూఎస్ డీఈ పీ శ్రీనివాసరావు, ఎంపీడీవో టీఎస్ మూర్తి, ఎంపీటీసీ సభ్యులు, అగ్నిమాపకదళ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

వేల్పూరులో..

తణుకు మండలంలోని వేల్పూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం పీ ఉషారాణి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిదులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు పురస్కారాలు

తణుకు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను తణుకు రూరల్ సర్కిల్ పరిధిలోనిపలువురు పోలీసు అధికారులతోపాటు సిబ్బంది పురస్కారాలు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈమేరకు జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, ఇరగవరం, అత్తిలి, తణుకు రూరల్ ఎస్సైలు కె.చంద్రశేఖర్, కె.చిన్నస్వామి, ఎం.రాజ్‌కుమార్, కానిస్టేబుళ్లు అక్బర్, అన్వర్, మహేష్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

ఫొటో రైటప్: 26 టీఎనెకె యూఆర్‌బీ 01- తణుకులో రిపబ్లిక్ వేడుకల్లో మాట్లాడుతున్న తమ్మయ్య తదితరులు.

తణుకు అర్బన్‌లో : రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంగా భారతదేశం సంపూర్ణ స్వరాజ్యం సాధించిన రోజును రిపబ్లిక్ డేగా నిర్వహించుకుంటున్నామని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా గురువారం తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జెండా వందనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనుభావుల పోరాట ఫలితమే మనం అనుభవిస్తున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన ఆలోచనా విధానాలతో రచించిన భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, నాయకులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, డీజే అమూల్యారావు, గుబ్బల సూర్యచంద్రరావు, జంగం ఆనంద్‌కుమార్, ఉండవల్లి జానకి, సంగిరెడ్డి శ్రీనివాస్, నత్తా కృష్ణవేణి, షేక్ బాజీ, జల్లూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సచివాలయలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద జాతీయా పతాకాన్ని అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయరు, జెడ్పీటీసీ పంపన అంజి బాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు,కె ఇల్లిందలపర్రు సొసైటి అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, చోడే జోషి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,ప్రజా ప్రతినిధులు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామలలోని పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కారించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

అత్తిలిలో: 74వ గణతంత్ర వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిపారు.ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ అబీబుద్దీన్, ఈవోఆర్డీ ఎం శ్రీనివాసరావు, గృహనిర్మాణశాఖ ఏఈ కె సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు పొందిన పెంటపాడు ఎంపీడీవో దామోదరరావు, ఉత్తమ పశువైద్యాధికారిగా జిల్లా పశువైద్యాధికారుల సంఘ అధ్యక్షులు మహేష్, వేల్పూరులో జరిగిన గణతంత్ర దినోత్స వేడుకల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పోలేపల్లి వెంకట ప్రసాద్, తదితరులు, కె ఇల్లిందలపర్రు జెడ్పి హైస్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నా నాయకులు. పురస్కారాలు అందుకున్న తణుకు సర్కిల్ సీఐ, ఎస్సైలు, సిబ్బంది

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పిప్పర నుంచి తాడేపల్లిగూడెం వరకు సాగిన కిసాన్ మోర్చా ర్యాలీ గురువారం పట్టణంలో ముగిసింది. బహిరంగ సభకు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని తెలిపారు. దేశంలో కార్పొరేట్లు హవా సాగుతుందని, అన్ని వర్గాలు నష్టపోతున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు. ఫార్వర్డ్ బ్లాక్ రైతు సంఘం నాయకులు దండు శ్రీనివాస్ రాజు, భారత రాష్ట్ర సమితి నాయకులు జి.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, మండల నాగేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంయుక్త కిసాన్‌మోర్చా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అత్యవసర విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం ఈనెల 27వ తేది పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్, పాతూరు సెమి ఇండోర్, కొండయ్య చెరువు సబ్ స్టేషన్‌ల పరిధిలో వన్ టౌన్‌లో ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

పాతూరులో రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో దాతలు, భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో వేంచేసియున్న పురాతన రామాలయం శిథిలం కావడంతో ఆ ఆలయాన్ని తొలగించి నూతన రామాలయం పునఃనిర్మాణానికి గురువారం రైతు సంఘం నాయకులు, దాత కర్రి సీతారామయ్య ఆధ్వర్యంలో కొవ్వూరు గాయత్రి పీఠం నిర్వాహకులు తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రిచే భూమి పూజ నిర్వహించారు. కర్రి సీతారామయ్య ఆలయం నిమిత్తం రూ. 5,55,555 విరాళం ప్రకటించారు. అంతేగాక సమీపంలో సమావేశపు మందిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రామకృష్ణ శాస్త్రిచే రామతత్వ ప్రవచనం గావించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు కర్రి నాగేశ్వరరావు, కర్రి ప్రభాకర్ బాలాజీ, బుద్దాల వెంకట రామారావు, కర్రి రామచంద్రరావు, ఆరాధ్యుల రాము, చోడగిరి శ్రీను, ఎస్.అప్పారావు, పాతూరు యువత సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న పాగా నేతన్నలను అభినందించిన ఉపముఖ్యమంత్రి



మల్లన్న పాగా నేసిన నేతన్న దంపతులను అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: శ్రీశైలం మల్లన్నకు పెంటపాడు మండలం రామచంద్రపురం చేనేత వీవర్స్ సభ్యుల నుంచి ఏటా పాగా నేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అందే పార్వతీశం, కోటమ్మ దంపతులు నేస్తున్న పాగా పని ముగిసింది. ఈ సందర్భంగా గూడెంలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు గురువారం వచ్చారు. మల్లన్న పాగాను మంత్రి కొట్టు సత్యనారాయణ పరిశీలించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రతి ఏటా నేతన్న నేస్తంలో భాగంగా మగ్గం నేస్తున్న ప్రతి ఒక్కరికీ రూ. 25 వేలు అందిస్తున్నారన్నారు.

ముత్యాలమ్మ చీరకు కిలో వెండి వితరణ



శ్రీముత్యాలమ్మవారి చీర నిమిత్తం కిలో వెండిని బహూకరిస్తున్న దాత దువ్వ శ్రీను

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు దువ్వ శ్రీను కిలో వెండిని సమకూర్చారు. ఈ వెండిని గురువారం ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబులకు దువ్వ శ్రీను కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు.